



తొట్టి మెరవణిలో
వాసవీ కన్యకాపరమేశ్వరిదేవి

జిల్లాలో దసరా ఉత్సవాలు కన్నుల పండువగా జరిగాయి. మొదటి రోజు నుంచి చివరి రోజు వరకు ఆయా ఆలయాల్లో నిర్వాహకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. పదిరోజులు దసరా సెలవులు రావడంతో విద్యార్థులు, ఉద్యోగులు ఆనందంగా పండుగలో గడిపారు. విజయదశమి రోజున బాణాసంచా పేలుళ్లు, విచిత్ర వేషధారణలు, కేరళ వాయిద్యాల నడుమ అమ్మవారి ఊరేగింపు వైభవంగా జరిగింది. ముఖ్యంగా రెండవ మైసూరుగా పేరొందిన ప్రొద్దుటూరు, కడప నగరంలో శరన్నవరాత్రి ఉత్సవాలు వేడుకగా జరిగాయి.

\- ప్రొద్దుటూరుటౌన్/కడప కల్చరల్



శమీ దర్శనానికి వెళుతున్న
ప్రొద్దుటూరు శివాలయం అమ్మవారు

వైభవం.. దసరా ఉత్సవం

- ముగిసిన శరన్నవరాత్రి వేడుకలు
- ప్రొద్దుటూరులో కన్నుల పండువగా అమ్మవారిశాల తొట్టి మెరవణి
- జనసంద్రంగా మారిన శివాలయం సెంటర్
- ఆకట్టుకున్న బాణాసంచా పేలుళ్లు, వేషధారణలు

ప్రొద్దుటూరులో..



దసరా ఉత్సవాలు మైసూరు తర్వాత అత్యంత వైభవంగా జరిగేది ప్రొద్దుటూరులోనే. జిల్లా నుంచే కాకుండా నలుమూలల నుంచి ఈ వేడుకలు చూసేందుకు లక్షల మంది ఇక్కడికి వస్తుంటారు. ఈ నేపథ్యంలో విజయదశమి సందర్భంగా శనివారం అమ్మవారి శమీ దర్శన మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయాల నిర్వాహకులు అమ్మవారి ఉత్సవ విగ్రహాలను శోభాయమానంగా అలంకరించి ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో కొలువుదీర్చి పురవీధుల్లో ఊరేగింపుగా కొర్రపాడు రోడ్డులోని శమీవృక్షం వద్దకు తరలించారు. విజయానికి, సిరిసంపదలకు, శుభాలకు చిహ్నమైన శమీ వృక్షాన్ని విజయదశమి రోజు దర్శించుకుని పూజలు చేస్తే శుభప్రదమని ప్రతీక. దీంతో అమ్మవారిశాల, శివాలయం, వెంకటేశ్వరస్వామి ఆలయం, చౌడేశ్వరీదేవి ఆలయం, రాజరాజేశ్వరీదేవి ఆలయ నిర్వాహకులు అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి శమీ దర్శనానికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా కేరళ సింగారి మేళం, సినీకళాకారుల డూప్స్, శక్తి వేషధారణలు, హర్యాన కళాకారుల భంభం భోలే నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. భక్తులు అమ్మవారి పాదాల వద్ద శమీవృక్ష పత్రాలను ఉంచి పూజలు చేశారు. ఒకరినొకరు శమీ పత్రాలు ఇచ్చుకుని శుభం కలగాలని ఆకాంక్షించారు. శమీ దర్శనం, తొట్టి మెరువణిని దర్శించుకొనేందుకు వచ్చిన భక్తులతో ప్రొద్దుటూరు పురవీధులు జనసంద్రంగా మారాయి.

వాసవీమాత తొట్టిమెరవణి

అమ్మవారిశాలలో అమ్మవారిని విజయలక్ష్మీదేవిగా అలంకరించి హంసవాహనంలో కొలువుదీర్చి (తొట్టి మెరవణి) పురవీధుల్లో అట్టహాసంగా గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కేరళ సింగారిమేళం భక్తులను ఆకట్టుకుంది. అమ్మవారిశాల నుంచి ప్రారంభమైన తొట్టి మెరవణి శివాలయం సెంటర్‌కు చేరడంతో భారీ ఎత్తున బాణాసంచా పేల్చారు. అమ్మవారిని తిలకించేందుకు వచ్చిన భక్తులతో పురవీధులు కిక్కిరిసి పోయాయి.

ఉర్రూతలూగించిన సినీ హీరోల డూప్స్

ఉత్సవాల సందర్భంగా సినీ హీరోల డూప్స్ యువతను ఉర్రూతలూగించారు. ముఖ్యంగా సీనియర్ ఎన్టీఆర్, బాలయ్య, చిరంజీవి, పవన్‌కళ్యాణ్, నాగార్జున తదితర సినీహీరోల డూప్స్ అభిమానులు అడిగిన పాటకు డ్యాన్స్‌లు వేస్తూ, డైలాగ్స్ చెబుతూ ఉత్సాహం నింపారు. అనంతరం శివాలయం సెంటర్‌లో తెల్లవారుజామున దాదాపు గంటపాటు పేల్చిన టపాసులు చూపరులను ఆకట్టుకున్నాయి. ఆకాశంలో అద్భుతం జరుగుతుందా అనేలా రంగురంగుల టపాసులు పేల్చడంతో భక్తులు ఆనందంగా తిలకించారు.

కాగా దసరా ఉత్సవాల నిర్వహణకు సహకరించిన భక్తులు, అధికారులకు ఆర్యవైశ్య సభ అధ్యక్షుడు బుశెట్టి రామమోహన్‌రావు కృతజ్ఞతలు తెలిపారు. రెవెన్యూ, మున్సిపల్, పోలీసు, విద్యుత్తు, అగ్నిమాపక శాఖతో పాటు వివిధ శాఖల అధికారుల సహకారంతో ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించామని తెలిపారు.



ఊరేగింపులో
కడప వాసవీ కన్యకాపరమేశ్వరి



ప్రొద్దుటూరు శివాలయం సెంటర్‌లో భారీ భక్తజనం

కడప నగరంలో..


శరన్నవరాత్రి ఉత్సవాలు శనివారంతో వైభవోపేతంగా ముగిశాయి. మొదటి రోజు నుంచి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ముగింపు సందర్భంగా జిల్లాలోని వివిధ ఆలయాల్లో కొలువుదీరిన అమ్మవారిని పురవీధుల్లో ఊరేగించి శమీవృక్ష దర్శనం చేయించారు. మిరమిట్లు గొలిపే బాణాసంచా కాంతులు, కళాకారుల నృత్యాలు, విచిత్ర వేషధారణలు గుర్రాలు, వృషభ రాజములు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా కడప నగరంలోని వాసవీ కన్యకాపరమేశ్వరిదేవి ఆలయం, విజయదుర్గాదేవి ఆలయం, రాజరాజేశ్వరి ఆలయం, గడ్డి బజారులోని సత్యనారాయణ స్వామి ఆలయంలో కళాకారుల ప్రదర్శనలు, బాణాసంచా వెలుగులు ప్రత్యేక ఆకర్షనగా నిలిచాయి. వరుసగా తొమ్మిది రోజుల పాటు వివిధ రూపాల్లో దర్శనమిచ్చి చివరిరోజున నగర పురవీధుల్లో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించిన అమ్మవారికి ఆదివారం రాత్రి పవళింపు సేవ నిర్వహించారు.





















ఊరేగింపులో కడప
విజయదుర్గాదేవి

అమ్మవారి ఊరేగింపులో అపశ్రుతి

- ఐదుగురికి విద్యుత్ షాక్
- ఒకరు మృతి - నలుగురికి గాయాలు
- ఎద్దు మృతి



మృతి చెందిన ఎద్దు



డెకరేషన్‌కు వైర్లు తగిలి షార్ట్ సర్క్యూట్ జరుగుతున్న దృశ్యం

కడప(క్రైం), అక్టోబరు 13: దసరా సందర్భంగా కడప నగరం బెల్లం మండివీధిలో జరిగిన అమ్మవారి ఊరేగింపులో అపశ్రుతి చోటు చేసుకుంది. మెరవణి సందర్భంగా తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ వైర్లు ఎద్దుల బండిపై ఉన్న అమ్మవారి డెకరేషన్‌కు తగలడంతో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగింది. ఈ సంఘటనలో ఒకరు మృతి చెందగా, నలుగురికి గాయాలయ్యాయి. అలాగే ఒక ఎద్దు అక్కడికక్కడే మృతి చెందింది.

ఎస్ఐ హుసేన్ వివరాల మేరకు.. దసరా ఉత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి నగరంలోని బెల్లంమండివీధిలో అమ్మవారి ఊరేగింపు సందర్భంగా నిర్వాహకులు ఎద్దులబండి మీద అమ్మవారి మెరవణి నిర్వహించారు. ఇందులో భాగంగా తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ వైర్లను చూసుకోకుండా అలాగే ముందుకు కదిలించారు. దీంతో ఎద్దులబండి పై ఉన్న అమ్మవారి డెకరేషన్‌కు ఆ వైర్లు తగిలి ఒక్కసారిగా షార్ట్ సర్క్యూట్ రావడంతో బండిపైన ఉన్న ఐదుమందికి విద్యుత్ షాక్ తగిలింది. వీరిలో పెండ్లిమర్రి మండలం ఎర్రమిట్ట గంగనపల్లెకు చెందిన మేకల రామయ్య (48) మృతి చెందగా, పుష్పగిరి ప్రాంతానికి చెందిన వెంకటరమణ, శ్రీనివాసులు, కడప బెల్లంమండివీధికి చెందిన రంగరాజ్‌కుమార్‌లతో పాటు మరో రెండున్నరేళ్ల బాలుడికి గాయాలైనట్లు తెలిపారు. సమాచారం తెలిసిన వెంటనే టూటౌన్ సీఐ నాగార్జున, ఎస్ఐ హుసేన్‌లు సంఘటన స్థలానికి చేరుకున్నారు. వైద్యపరీక్షల నిమిత్తం గాయపడ్డ ముగ్గురిని రిమ్స్‌కు, బాలుడిని కడపలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. కాగా మృతుడు రామయ్య కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడని, దసరా ఉత్సవాల్లో భాగంగా ఆయన గడ్డిబజారులోని బాలాజీ దేవాలయంలో ఉన్న అమ్మవారి ఊరేగింపులో లైటింగ్ పనులకు వచ్చాడన్నారు. ఇతనికి భార్య, కుమారుడు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించామని, కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు. అలాగే మృతి చెందిన ఎద్దు విలువ రూ.6లక్షల పైమాటే ఉంటుందని స్థానికులు చెప్పుకొచ్చారు.





మృతి చెందిన రామయ్య.. గాయపడిన బాలుడు

జిల్లాకు పొంచివున్న తుఫాను

- బంగాళాఖాతంలో అల్పపీడనం
- రెవెన్యూ డివిజన్లలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు
- కలెక్టర్ శివశంకర్ లోతేటి

కడప(కలెక్టరేట్), అక్టోబరు 13: బంగాళాఖాతంలో సోమవారం నాటికి అల్పపీడనం ఏర్పడనున్న నేపథ్యంలో వాతావరణశాఖ హెచ్చరిక మేరకు జిల్లాకు తుఫాను ప్రభావం ఉండనుందని కలెక్టర్ శివశంకర్ లోతేటి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో విస్తృతంగా పిడుగులతో కూడిన తేలిక పాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని, జిల్లా అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంతో పాటు కడప, బద్వేలు, పులివెందుల, జమ్మలమడుగు రెవెన్యూ డివిజన్ల కార్యాలయాల్లో 24 గంటలు పని చేసేలా కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భారీ వర్షాలకు సంబంధించిన ఏదైనా సమాచారాన్ని కలెక్టరేట్‌తో పాటు ఆయా ఆర్డీవో కార్యాలయాల్లోని కంట్రోల్ రూమ్ నెంబర్లకు ఫోన్ చేసి తెలుసుకోవచ్చన్నారు. లోతట్టు ప్రాంతాల్లో టాంటాం లేదా మైకులతో ప్రజలను అప్రమత్తం చేయాలని ఆర్డీవోలు, తహశీల్దార్లను కలెక్టర్ ఆదేశించారు. అనుకోని అత్యవసర పరిస్థితులు ఏర్పడితే ముందు జాగ్రత్తగా అనువైన ఆశ్రయ కేంద్రాలను గుర్తించాలన్నారు. మున్సిపల్, వైద్య ఆరోగ్యం, విద్యుత్, ఇరిగేషన్, పంచాయతీరాజ్, విపత్తు నిర్వహణ, అగ్నిమాపక తదితర శాఖల అధికారులు, వారి సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అధికారులు అందరూ జిల్లా కేంద్రంలో, వారు పనిచేసే ప్రాంతాల్లో అందుబాటులో ఉండాలని తెలిపారు.

కంట్రోల్ రూమ్ నెంబర్లు

కడప కలెక్టరేట్ (08562-246344), కడప ఆర్డీవో కార్యాలయం (89854 29256), జమ్మల మడుగు (9618804882), బద్వేల్ (7013323862), పులివెందుల (8520082425), (9542299885)లకు ఫోన్ చేసి సమస్యలు తెలపవచ్చన్నారు.

లక్కీఛాన్స్ ఎవరికో?

- నేడే మద్యం షాపులకు లాటరీ
- 139 షాపులు, 3257 దరఖాస్తులు
- జిల్లా పరిషత్‌లో ఏర్పాట్లు పూర్తి



జడ్పీలో ఏర్పాట్లు చేస్తున్న అధికారులు

(కడప-ఆంధ్రజ్యోతి): మందుబాబులు ఎప్పుడెప్పుడా అంటూ ఎదురుచూసిన మాజీ సీఎం జగన్ మద్యం పాలసీకి ప్యాక్ పడింది. 2019కి ముందు జిల్లాలో ఎలాంటి మద్యం బ్రాండ్లు ఉండేవో అవన్నీ రేపు, ఎల్లుండో మళ్లీ అందుబాటులోకి రానున్నాయి. నూతన మద్యం పాలసీపై కూటమి ప్రభుత్వం కన్నా మందుప్రియులు చాలా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. జగన్ హయాంలో ప్రభుత్వమే మద్యం అమ్ముతుందన్న పేరు చెప్పి జె బ్రాండ్స్ అమ్మారనే విమర్శలున్నాయి. కూటమి ఎన్నికల ప్రచారంలో మద్యంపాలసీని మారుస్తామని సీఎం చంద్రబాబునాయుడు చెప్పుకొచ్చారు. అందుకు తగ్గట్లుగా నూతన మద్యంపాలసీ అమలు కాబోతుంది. ఇప్పుడు కొత్తపాలసీలో మద్యంషాపుల కోసం పెద్దఎత్తున దరఖాస్తులు చేశారు. జిల్లాలో 139 మద్యంషాపులు ఉంటే 3257 దరఖాస్తులు వచ్చాయి. అయితే లక్కీచాన్స్ ఎవరికో కొన్నిగంటల్లో తేలనుంది. కడప జిల్లాలో 139 మద్యంషాపులు ఉన్నాయి. ఇందులో కడప ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 30, పులివెందుల 16, జమ్మలమడుగు 14, ఎర్రగుంట్ల 14, మైదుకూరు 16, ప్రొద్దుటూరు 19, సిద్దవటం 8, ముద్దనూరు 7, బద్వేలు 15 షాపులకు గానూ మొత్తం 3257 దరఖాస్తులు వచ్చాయి.

సిండికేట్ విఫలం

మద్యంషాపుల్లో టీడీపీ, వైసీపీ మద్యం వ్యాపారులు కుమ్మక్కయ్యారనే విషయంపై ఆంధ్రజ్యోతి వరుస కథనాలు ప్రచురించింది. లిక్కర్ మాఫియా వేసే గూడుపుఠాణిని క్షుణ్ణంగా వివరించింది. ఇది పెద్ద హైలెట్‌గా నిలిచింది. లాటరీలో తేలకముందే సిండికేట్‌కు ప్రయత్నిస్తే సీఎం చంద్రబాబు వద్ద చీవాట్లు తప్పదని భయపడిన కొందరు మీరు టెండరు వేయండి, తరువాత చూసుకుందాం అంటూ చెప్పారని చెబుతారు. బ్రాందీషాపు దరఖాస్తుల్లో జోక్యం చేసుకుంటే సహించేది లేదని చంద్రబాబు వార్నింగ్ ఇవ్వడంతో కొందరు కూటమి నేతలు సైలెంట్ అయినట్లు సమాచారం. అందుకే భారీ ఎత్తున దరఖాస్తులు వచ్చాయి. ఇక మద్యం లక్ వీరులు ఎవరో నేడు డ్రాలో తేలనుంది.

ఆలస్యంగా వస్తే అనుమతించం

- అరగంట ముందే హాజరుకావాలి
- కడప ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవికుమార్



కడప (క్రైం), అక్టోబరు 13: మద్యంషాపుల కోసం దరఖాస్తు చేసుకున్న వారు అరగంట ముందే జిల్లా పరిషత్ కార్యాలయానికి రావాలని, ఆలస్యంగా వచ్చిన వారిని అనుమతించమని కడప ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవికుమార్ అన్నారు. ఆయన తన కార్యాలయంలో ఆదివారం మీడియాతో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 139 షాపులకు గాను 3257 దరఖాస్తులు వచ్చాయని, కేవలం ఈ దరఖాస్తుల రూపంలో రూ.65 కోట్ల 14 లక్షలు ఆదాయం వచ్చిందన్నారు. సోమవారం జడ్పీలో 8 గంటలకు లాటరీ పద్ధతిలో ఎంపికలు నిర్వహిస్తారని, మొదట రెండు ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో ఈ ఎంపిక నిర్వహిస్తామని తెలిపారు. దరఖాస్తుదారులు తప్పకుండా ఎంట్రీ పాస్‌తో ఉదయం 7.30కి జడ్పీ ప్రాంగణానికి చేరుకోవాలని కోరారు. మద్యంషాపులకు ఎంపికైన వారు వన్ బై సిక్స్ డబ్బులు చెల్లించాల్సి ఉంటుందన్నారు. దరఖాస్తుదారుల సమక్షంలోనే కలెక్టరు చేతుల మీదుగా లాటరీ తీస్తామని తెలిపారు.

శ్రీ కృష్ణాడెంటల్ కేర్‌ను సద్వినియోగం చేసుకోండి

ప్రారంభోత్సవంలో కమలాపురం ఎంఎల్ఏ పుత్తా కృష్ణచైతన్యరెడ్డి



ఆస్పత్రిని ప్రారంభిస్తున్న డాక్టర్ బ్రిజేష్ క్రిష్ణ తల్లి అనసూయదేవి చిత్రంలో ఎమ్మెల్యే క్రిష్ణచైతన్యరెడ్డి, రామగోపాల్‌రెడ్డి, హరిప్రసాద్, గోవర్ధన్‌రెడ్డి

కడప (మారుతీనగర్) అక్టోబరు 13: అత్యాధునిక వసతులతో కడపలో కొత్తగా ఏర్పాటు చేసిన శ్రీ కృష్ణా డెంటల్ కేర్‌ను నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కమలాపురం ఎంఎల్ఏ పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామ్‌గోపాల్‌రెడ్డి కోరారు. శనివారం స్థానిక సీఎస్ఐ చర్చి ఎదురుగా కొత్తగా ప్రారంభించిన శ్రీకృష్ణా డెంటల్ కేర్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ కడప నాగరాజుపేటలో ఎనిమిదేళ్ల కిందట ప్రారంభించిన సంస్థ రెండో బ్రాంచ్‌గా అత్యాధునిక వసతులతో మరింత నూతన వసతులతో ప్రారంభించామన్నారు. ఇందులో ఎక్స్‌రే, లేజర్ మిషన్, మిగతా వైద్యానికి సంబంధించిన ఆధునిక పరికరాలు ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారని, కావున ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. శ్రీ కృష్ణా డెంటల్ కేర్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బండారు బ్రిజేష్ క్రిష్ణ, చైర్మన్ బండారు రాజగోపాలయ్య మాట్లాడుతూ దంత వైద్యశాలలో ఎలాంటి ఫీజు లేకుండా ప్రభుత్వ ఉద్యోగులకు, విశ్రాంత ఉద్యోగులకు, వర్కింగ్ జర్నలిస్టులకు దంత వైద్యం అందించే వసతి ఉందన్నారు. ఈ దంత వైద్యశాలలో చాలా తక్కువ ధరలతో పేదలకు చికిత్స చేస్తామన్నారు. కార్యక్రమంలో సీనియర్ రాజకీయవేత్త వీవీఎస్ మూర్తి, టీడీపీ జనరల్ సెక్రటరీలు బి. హరిప్రసాద్, ఎస్. గోవర్ధన్‌రెడ్డి, రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ వి.ఎస్. అమీర్‌బాబు, మైనార్టీ నేతలు సుభాన్‌బాషా, బలిజ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు పాల్గొన్నారు.

'బకాయిల చెల్లింపులో జాప్యం తగదు'

కడప (ఎడ్యుకేషన్), అక్టోబరు 13: ఉద్యోగ ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిల చెల్లింపులో జాప్యం తగదని యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏపీ జేఏసీ సెక్రటరీ జనరల్ ప్రసాద్ తెలిపారు. ఆదివారం కడప నగరం యూటీఎఫ్ భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయులకు ఆర్థిక బకాయిల చెల్లింపుల్లో వైసీపీ ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందిందన్నారు. ఉద్యోగులు తమ అవసరాలకోసం దాచుకున్న పీఎఫ్ సొమ్మును సైతం వైసీపీ ప్రభుత్వం ఇతర అవసరాలకు మళ్లించిందని ఆరోపించారు. పీఎఫ్ రుణాలు, ఏపీజీఎల్ఐ రుణాలు, సరెండరు లీవ్ బకాయిలు, డీఏ బకాయిలు, గత పీఆర్సీ బకాయలు చెల్లింపులకు నోచుకోలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.22వేల కోట్ల పైబడిన బకాయిలను ఉద్యోగ ఉపాధ్యాయులకు చెల్లించాల్సి ఉందన్నారు. ఎన్నికల హామీల్లో భాగంగా ఉద్యోగ ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిలన్నీ చెల్లించాలని వారు కోరారు. ప్రస్తుతం ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు మాసాలు గడిచినా ఉద్యోగ ఉపాధ్యాయ సమస్యలపై దృష్టిసారించడం లేదన్నారు. 12వ పీఆర్సీ అమలు చేయాల్సి ఉన్నప్పటికీ గత పాలకుల వైఖరితో పీఆర్సీ అమలుకు నోచుకోలేదన్నారు. కూటమి ప్రభుత్వం సైతం 12వ పీఆర్సీ అమలు పట్ల చిత్తశుద్ధి కనబరచలేదని ఆరోపించారు. దసరా కానుకగా ఐఆర్ ప్రకటిస్తారని ఎదురు చూసిన ఉద్యోగుల ఆశలపై రాష్ట్ర ప్రభుత్వం నీళ్లు చల్లిందన్నారు. సమావేశంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజా, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు విజయకుమార్, మహేశ్‌బాబు, జిల్లా సహాధ్యక్షుడు రవికుమార్, కార్యదర్శి శ్రీనివాసులు, క్రిస్టారెడ్డి, అన్నమయ్యజిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు హరిప్రసాద్, జాబీద్, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

రెండు బైక్‌లను దగ్ధం చేసిన దుండగులు



మంటల్లో కాలిపోయిన బైక్‌లు

బద్వేలుటౌన్, అక్టోబరు 13: స్థానిక వెంకటయ్యనగర్‌లో రెండు బైక్‌లను శనివారం అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు దగ్ధం చేశారు. వివరాల్లోకెళితే... వెంకటయ్యనగర్‌లో నివాసం ఉంటున్న తలకట్ల వెంకటేష్, తలకట్ల మహేష్ వాహనాలను శనివారం అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు ద్విచక్రవాహనాలకు నిప్పంటించారు. దీంతో ద్విచక్రవాహనాలు పేలినట్లు శబ్దం రావడంతో వీధిలోని వారంతా ఒక్కసారిగా ఉలిక్కిపడి బయటకు వచ్చారు. వాహనాలు కాలుతుండటం చూసి భయభ్రాంతులకు గురయ్యారు. వాహనదారులు దుకాణాల్లో గుమ్మస్తాలుగా పనిచేస్తున్నారు. తమ వాహనాలను ఎందుకుకాల్చారో అర్థంకావడంలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఇలాంటి సంఘటన ఎప్పుడూ జరగలేదు. బద్వేలు అర్బన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యల ఒడి - మాసాపేట బడి

ప్రహరీ లేక పాఠశాలలోకి పశువులు ● అధ్వాన్నంగా మరుగుదొడ్లు.. అవస్థల్లో విద్యార్థులు

అసంపూర్తిగా నాడు - నేడు పనులు ● పట్టించుకోని విద్యాశాఖ అధికారులు



అసంపూర్తిగా నాడు- నేడు రెండో విడత భవనాలు



ప్రహరీ లేని మాసాపేట హైస్కూల్ దక్షిణభాగం - తూర్పు భాగం - ఉత్తర భాగం, లోనికి వచ్చిన పశువులు

రాయచోటిటౌన్, అక్టోబరు13: అన్నమయ్య జిల్లా కేంద్రం, కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలో జాతీయ రహదారికి పక్కనే ఉన్న మాసాపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. సుమారు 700 మందికిపైగా విద్యార్థినీ, విద్యార్థులు ఉన్న మాసాపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతోంది. జిల్లా కేంద్రంలో జాతీయ రహదారికి పక్కనే ఉన్న ఈ ఉన్నత పాఠశాలకు ఉత్తరం, తూర్పు భాగాల్లో రెండు వైపులా ప్రహరీ లేకపోవడంతో విద్యార్థులకు పూర్తి స్థాయిలో రక్షణ లేదని చెప్పవచ్చు. ప్రహరీ లేని కారణంగా పటిష్టాట హైస్కూల్ చుట్టుపక్కల ప్రాంతాల్లో మేతకోసం వచ్చే పశువులు, గొర్రెలు పాఠశాల ఆవరణలోకి వస్తుండడంతో విద్యార్థుల విద్యాభ్యాసానికి ఆటంకంగా మారుతోంది. దీనికి తోడు రాత్రి సమయాల్లో మందుబాబులు పాఠశాల ఆవరణలోకి వచ్చి మద్యంతాగి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. బ్రేకు వదిలిన సమయంలో కొందరు విద్యార్థులు బాత్‌రూంకు అంటూ బయటకు వెళుతున్నట్లు తెలుస్తోంది. ఇద్దరు పీడీలు కాపలా కాస్తున్నా కొందరు విద్యార్థులు వారి కళ్లు గప్పి బయటకు వెళ్లిపోతున్నట్లు సమాచారం. పాఠశాల నైట్ వాచ్‌మెన్‌పై కూడా అమాయిత్యం జరిగినట్లు సమాచారం. అయితే ఆ విషయాన్ని పాఠశాల సిబ్బంది బయటకు రానివ్వకుండా మేనేజ్ చేసినట్లు తెలుస్తోంది. నైట్ వాచ్‌మెన్ ఉండడానికి ఒక గది ఇవ్వాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులను అడిగినా వాచ్‌మెన్‌కు గది ఆమెపై అమాయిత్యం జరిగిందని పలువురు అంటున్నారు. పాతవాల భవనాలు కొన్ని పాతవి కావడంతో అక్కడక్కడ బండలు లేచిపోయి తరగతుల నిర్వహణకు ఇబ్బందికరంగా ఉండడంతో నాడు- నేడు రెండో విడత కింద మంజూరైన 8 గదుల భవనం ఒకటి, రెండు గదుల భవనం మరొకటి అసంపూర్తిగానే ఉండిపోయారు. ఫలితంగా ఒక్కో సమయంలో విద్యార్థులకు చెట్ల కింద కూర్చోబెట్టుకుని చదివించుకుంటున్నారు. వైసీపీ ప్రభుత్వంలో మంజూరైన నాడు-నేడు రెండో విడత కింద మంజూరైన 8 గదుల భవనం ఒకటి, రెండు గదుల భవనం మరొకటి అసంపూర్తిగానే ఉండిపోయాయి. ఫలితంగా ఒక్కో సమయంలో విద్యార్థులను చెట్ల కింద కూర్చోబెట్టుకుని చదివించుకున్నారు. వైసీపీ ప్రభుత్వంలో మంజూరైన నాడు- నేడు పనులు అలాగే ఉండిపోయాయి. ఫలితంగా విద్యార్థులను గదుల కొరత వెంటాడుతోంది. చాలా మంది హాస్టల్ విద్యార్థులు, గ్రామీణ, పట్టణ ప్రాంత పేదలు చదువుతున్న ఈ పాఠశాలలో మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నాయి. నాడు- నేడు పథకం కింద ఏర్పాటు చేసిన మరుగుదొడ్ల నిర్వహణ లోపంతో కంపు కొడుతూ అసౌకర్యంగా మారాయి. ప్రత్యేక సిబ్బంది ఉన్నా వాటిని పట్టించుకోకపోవడంతో మరుగుదొడ్లకు ఏర్పాటు చేసినడోర్లు పగలగొట్టడమే కాకుండా స్విచ్ బోర్డులు పగలగొట్టి ప్రమాదకరంగా తయారు చేశారు. వాటిని విద్యార్థులు పగలగొట్టారా లేక ప్రహరీ లేని కారణంగా ఎవరైనా మందుబాబులు, ఆకతాయిలు పాఠశాల ఆవరణలోకి వచ్చి పగలగొట్టారా అనే విషయం అర్థం కావడం లేదు. పాఠశాలలో ముగ్గురు ఆయాలున్నా మరుగుదొడ్ల నిర్వహణ సరిగ్గా లేదంటే పాఠశాల ప్రధానోపాధ్యాయుల పర్యవేక్షణ లోపమని పలువురు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. పాఠశాల విద్యార్థుల క్రమశిక్షణకు ముఖ్యమైన ప్రహరీ లేకపోవడంతోనే పాఠశాల సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోందని సిబ్బంది సహా విద్యార్థులు, తల్లిదండ్రులు వాపోతున్నారు. జిల్లా విద్యాశాఖ అధికారులు తగు చర్యలు తీసుకుని ప్రహరీ ఏర్పాటు చేసి ఉన్నత విద్యార్థుల విద్య కుంటు పడకుండా చూడాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

స్కూటరు, కారు ఢీ - ఒకరికి గాయాలు



దెబ్బతిన్న కారు ముందుభాగం

ఖాజీపేట, అక్టోబరు 13: కడప, కర్నూలు జాతీయ రహదారిలోని రావులపల్లె క్రాస్‌రోడ్డువద్ద కారు, స్కూటరు ఢీకొనడంతో కుమార్‌కు స్వల్ప గాయాలయ్యాయి. రావులపల్లె హరిజనవాడ వాసి కుమార్ పని నిమిత్తం ఖాజీపేటకు వెళ్లి తిరిగి వస్తుండగా రావులపల్లె వద్ద రోడ్డు క్రాస్ అవుతుండగా కడప నుంచి నంద్యాలకు వెళుతున్న కారు ఢీకొనడంతో కారు భారీగా దెబ్బతినింది. కుమార్‌ను చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు 108 ద్వారా తరలించారు.

22 మంది పేకాటరాయుళ్ల అరెస్టు

జమ్మలమడుగు, అక్టోబరు 13: జమ్మలమడుగు నగర పంచాయతీ పరిధి ఈడిగపేటలో శనివారం రాత్రి 22 మంది పేకాటరాయుళ్లను అరెస్టు చేసినట్లు అర్బన్ సీఐ లింగప్ప తెలిపారు. రాబడిన సమాచారం మేరకు వెంటనే పేకాటస్థావరంపై తమ సిబ్బందితో దాడి చేసి పట్టుకున్నామన్నారు. పట్టుబడిన 22 మందిని స్టేషన్‌కు తీసుకువచ్చి వారి నుంచి రూ.1,20,600 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

మెడకు తాడు బిగించి చంపి.....

మృతదేహం మర్మాంగాలను కాల్చిన భార్య ● పెనుగొండలో భర్తను హత్య చేసిన భార్య, అత్త, బావమరిది

పోలీసులకు సమాచారం అందించిన ఆటో డ్రైవర్ ● వీడిన హత్యకేసు మిస్టరీ




ప్రశాంత్ మృతదేహం (ఫైల్)

కేసముద్రం(మహబూబాబాద్ జిల్లా), అక్టోబరు 13: తెలంగాణ రాష్ట్రం మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం పెనుగొండలో కడప వాసి లక్కే ప్రశాంత్ (30)ను ఆయన భార్య, అత్త, బావమరిది కలిసి తాడుతో ఉరి వేసి చంపారు. అనంతరం కసి తీరక అట్ల గరిటతో మర్మాంగాలను భార్య కాల్చింది. లక్కే ప్రశాంత్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన విషయం విదితమే. ఈ కేసు విచారణ అనంతరం మహబూబాబాద్ రూరల్ సర్కిల్ ఇన్‌చార్జ్ గూడూరు సీఐబాబురావు తెలిపిన ప్రకారం వివరాల్లోకెళితే... కడప జిల్లా సింహాద్రిపురం మండలం చవ్వారిపల్లి వాసి అమీనాను ప్రేమవివాహం చేసుకున్నాడు. కాగా ఉపాధి కోసం నాలుగు నెలల కిందట భార్య పిల్లలతో కలిసి ప్రశాంత్ పెనుగొండలో భవన నిర్మాణ పని చేసేందుకు వచ్చాడు. అమీనాకు రెండో పెళ్లి కావడంతో భర్త ప్రశాంత్ ఆమెను అనుమానిస్తూ పిల్లలు నాకు పుట్టలేదంటూ నిత్యం మద్యం తాగి వచ్చి ఆమెను కొడుతుంటాడు. ఈ క్రమంలో తనను నిత్యం శారీరక, మానసిక హింసకు గురిచేస్తున్నాడని, ఇదే గ్రామంలో ఉంటున్న పులివెందుల మండలం ఎర్రగుడిపల్లి వాసి అమీనా తల్లి కడియాల నూర్జహాన్, సోదరుడు కడియాల అమర్ బాషాకు తన గోడు వెల్లబోసుకుంది. ప్రశాంత్ తనను, తన పిల్లలను, అవసరమైతే మిమ్మల్ని కూడా చంపుతానని బెదిరిస్తున్నాడని అమీనా తల్లి, సోదరునికి తెలిసింది. ప్రశాంత్‌ను చంపాలని ముగ్గురు కలిసి నిర్ణయించుకుని ఈనెల 10న అర్ధరాత్రి తర్వాత 2.30గంటలకు ముగ్గురూ కలిసి తాడుతో ప్రశాంత్ మెడకు ఉరివేసి చంపారు. అయినా కసి తీరక అమీనా అట్ల గరిట(సరాతం)ను స్టౌపై వేడి చేసి తన భర్త ప్రశాంత్ మర్మాంగంపై కాల్చింది. ఆ తర్వాత గ్రామంలో ఎవరికీ అనుమానం రాకుండా మృతదేహాన్ని రైల్వేట్రాక్‌పై పడవేయాలని నిర్ణయించుకుని ఆటో డ్రైవర్ రామును పిలిచారు. డ్రైవర్‌ను మభ్యపెట్టి మృతదేహాన్ని ఆటోలో రైల్వేస్టేషన్‌కు తరలిస్తుండగా అనుమానించిన డ్రైవరు వారిని నిలదీయగా హత్య విషయం బయటపడింది. దీంతో రాము 100 పోలీసులకు, 108కు సమాచారం అందించాడు. 108 సిబ్బంది ప్రశాంత్ మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రికి తరలించగా అక్కడి వైద్యులు మృతి చెందినట్లు ధ్రువీకరించారు. నిందితులు అమీనా, నూర్జహాన్, అమర్ బాషాను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించారు. సమయస్ఫూర్తితో పోలీసులకు సమాచారం అందించిన ఆటో డ్రైవర్ రామును, కేసు దర్యాప్తు చేసిన ఎస్ఐ మురళీధర్‌రాజ్‌ను ఎస్పీ సుధీర్‌రాంనాథ్‌కేకన్ అభినందించారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరికి కత్తి పోట్లు

ప్రొద్దుటూరు , అక్టోబరు 13: పట్టణంలో రెండు వేర్వేరు ఘటనల్లో ఇద్దరికి కత్తిపోటు గాయాలయ్యాయి. వివరాల్లోకెళితే అంధ్రకేసరి రోడ్డుకు చెందిన చింతల సుధీర్ శనివారం రాత్రి దసరా సంబరాలు తిలకించడానికి రాజీవ్ సర్కిల్‌కు స్నేహితులతో వచ్చాడు. గుంపుల్లోవున్న ఒకరు సుధీర్ మీద పడడంతో స్వల్పంగా ఘర్షణ పడ్డారు. తరువాత అక్కడి నుంచి వెళ్లి తన స్నేహితులు నలుగురితో కలిసి వచ్చి కత్తితో సుధీర్ కడుపుపై బాగనా పొడిచాడు. అక్కడి నుంచి వారు పరారయ్యారు. బాధితుడు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. శ్రీనివాస నగర్ వాసి పెయింటర్ కాలేషావలి శనివారం రాత్రి మైదుకూరు రోడ్డులో ఖాళీ బండపై కూర్చుని వుండగా ఖాసీంపీరా వచ్చి సిగరేట్ తాగుతూ నిలబడ్డాడు. సిగరేట్‌పొగ నచ్చని కాలేషావలి పక్కకు వెళ్లమని ఖాసీంపీరాను కోరగా కాలేషా వలితో గొడవపడ్డాడు. దీంతో అక్కడి నుంచి వెళ్లిన ఖాసీం పీరా నలుగురితో వచ్చి కాలేషావలిపై కత్తితో దాడి చేశాడు. కాలేషావలికి తీవ్ర గాయాలవడంతో అతన్ని కడప రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఎగ్జిబిషన్‌లో నిలువు దోపిడీ

ఎంట్రీ సహా వినోదపరికరాలకు అధికరేట్లు ● అమలు కాని గెజిట్ రేట్లు

ధరలను నియంత్రించలేని మున్సిపల్ అధికారులు



ప్రొద్దుటూరు అక్టోబరు 13: పసిడిపురి దసరా ఉత్సవాలు రెండో మైసూరును తలపిస్తుంది. వివిధ ఆలయాల్లో అమ్మవారి అలంకారాలు ఎంతో కనువిందు గొలుపుతాయి. ఇక్కడికి రాష్ట్రేతర భక్తులు సైతం వచ్చి ఉత్సవాల్లో పాల్గొంటుంటారు. దీంతో పట్టణం నిత్యం భక్తులు, కొత్త, పాత వారితో కళకళలాడుతుంటోంది. ఇలాంటి సమయంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌తో ప్రజలకు మరింత వినోదం అందుతుంది. దసరా సంబరాల సందర్భంగా ఏటా అనిబీసెంట్ మున్సిపల్ హైస్కూలు గ్రౌండ్‌లో ఎగ్జిబిషన్ నిర్వహిస్తారు. ఈ ఏడాది టీడీపీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి అనుచరవర్గం ఎగ్జిబిషన్ వేలం పాటను రూ.1.75 కోట్లకు దక్కించుకుంది. 45 రోజుల పాటు నిర్వహించే ఈ ఎగ్జిబిషన్‌కు లీజు వేలం డబ్బు సహా 18 శాతం జీఎస్టీ కలిపి మొత్తం 2.6కోట్లు మున్సిపాలిటీకి చెల్లించాలి. దీంతో మున్సిపాలిటీ చరిత్రలో ఎన్నడూ లేని రీతిలో ఇంత పెద్ద మొత్తం లీజు వేలంలో పోవడం ఇదే మొదటి సారి. దీంతో నిర్వాహకులు ఈ నెల 4 తేదీ నుంచి ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. మున్సిపల్ గెజిట్ ప్రకారం ఎంట్రీ టిక్కెట్లు పెద్దలకు రూ.25 పిల్లలకు రూ.15 నిర్ణయించారు. వినోద పరికరాలు ఏవైనా రూ.80 మాత్రమే వసూలు చేయాలని అధికారులు బ్యానర్లు పెట్టి ప్రచారం చేశారు. కానీ మొదటి రోజు నుంచే నిర్వాహకులు రూ.25 వున్న పెద్దల టిక్కెట్టుకు రూ.30, రూ.15 వున్న పిల్లల టిక్కెట్లు రూ.20 పెట్టారు. వినోద పరికరాలకు రూ.80 వుంటే రూ.100 వసూలు చేస్తున్నారు. ఇందుకు నిర్వాహకులు టిక్కెట్లు ధరలపై రూ.18 శాతం జీఎస్టీ సహా కలిపి వసూలు చేశామని అధికారులకు సమాధానమిచ్చింది. దీంతో అధికారులు, ప్రజలు, ప్రతిపక్షాలు సైతం దీన్ని పెద్దగా పట్టించుకోలేదు. విజయ దశమి రోజున రూ.25 రూపాయల వున్న ఎంట్రీ టిక్కెట్లు కొన్ని గంటలపాటు రూ. 50 పెంచారు. తరువాత రూ.100 పెంచారు. వినోద పరికరాలు రూ.100 వున్నవి రూ.150కి పెంచారు. దీంతో పెద్దఎత్తున టీడీపీ నేత ప్రవీణ్‌కుమార్‌రెడ్డి సోషల్‌మీడియాలో విస్తృతంగా ప్రచారం చేశారు. వైసీపీ నేత మున్సిపల్ వైస్ చైర్మెన్ బంగారురెడ్డి సైతం ప్రెస్‌మీట్ పెట్టి ఎగ్జిబిషన్‌లో జరిగిన దోపిడీని ఎండగట్టాడు. అధికారులు చర్యలు తీసుకోకపోతే చట్టపరంగా కోర్టులో కేసు వేస్తామని బంగారు రెడ్డి హెచ్చరించారు. విజయదశమి ఒక్కరోజు నిర్వాహకులు అధికరేట్లు వసూళ్లు చేయడంతో అధికార ప్రతిపక్ష నేతలు దీన్ని ఎమ్మెల్యే వర్గం దోపిడీగా అభివర్ణించే ప్రయత్నం చేస్తూ ఆరోపించారు. ఎగ్జిబిషన్‌లో రూ.5 కోట్లమేర దోపిడీ జరిగిందని బంగారు రెడ్డి ఆరోపించారు. ఇదంతా వరదరాజులరెడ్డి కుమారుడు కొండారెడ్డి ఆదేశాలతో జరిగిందని ఆరోపించారు. దీన్ని ఎగ్జిబిషన్ కాంట్రాక్టర్ ఆర్‌వీ చలపతి తీవ్రంగా ఖండించారు. ఈ ఎగ్జిబిషన్‌కు ఎమ్మెల్యేకు సంబంధం లేదని కేవలం కొందరు పనికట్టుకుని ఆరోపిస్తున్నారన్నారు. ఎగ్జిబిషన్‌లో విజయదశమినాడు కేవలం రూ.50 మాత్రమే టికెట్లు వసూలు చేశామని చలపతి ఆంధ్రజ్యోతికి వివరణ ఇచ్చారు. అయితే ఆదివారం కూడా రూ.50 నుంచి రూ.100 వసూలు చేశారని ఆరోపణలున్నాయి. మున్సిపల్ ఆర్ఐ చరణ్‌రెడ్డిని వివరణ కోరగా కేవలం విజయ దశమి రోజు రాత్రికొన్ని గంటలు రూ.50 నుంచి రూ.100 వసూలు చేశారని తాము అక్కడే వుండి టికెట్ల ధరలు ఎంతకు విక్రయించేది పరిశీలించామని తెలిపారు. అధిక రేట్లకు విక్రయిస్తే కమిషనర్ ఆదేశాలతో చర్యలు తీసుకుంటామని నిర్వాహకులను హెచ్చరించి వచ్చామని తెలిపారు. ఈ ఎగ్జిబిషన్‌లో అధిక రేట్లు విక్రయించడం ఏటా జరుగుతూనే వుంటున్నదే. దీనిపై మున్సిపల్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోక పోవడం కేవలం తమకు కట్టవలసిన లీజు డబ్బు రాబట్టుకోవడంపై మాత్రమే వారు దృష్టి పెట్టి ప్రజలు అధిక రేట్ల దోపిడికి గురికావడాన్ని పట్టించుకోక పోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నిండు ప్రాణం బలిగొన్న బాకీ



భర్త నిర్బంధం భార్య బలవన్మరణం

రాపూరు, అక్టోబరు 13: కూలి కోసం చేసిన అప్పు నిండు ప్రాణాన్ని బలిగొంది. బకాయిలో కొంత మొత్తం చెల్లించినా అంగీకరించని యజమాని భర్తను నిర్బంధించడంతో మనస్థాపానికి గురైన భార్య చెంచులక్ష్మి (24) విషద్రావణం తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఇది ముమ్మాటికీ వెట్టిచాకిరీ అని చెప్పవచ్చని రాష్ట్ర యానాది సంఘం ఆరోపిస్తోంది. గిరిజన మహిళ ఆత్మహత్య చేసుకునేందుకు కారణమైన యజమానిని వెంటనే అరెస్టు చేయాలని, బాధిత కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. నెల్లూరు జిల్లా రాపూరు మండలం మద్దెలమడుగు సమీపంలో శనివారం రాత్రి చోటుచేసుకున్న సంఘటన వివరాల్లోకెళితే...

తిరుపతి జిల్లా డక్కిలి మండలం దందోలు వాసులు ఏకోలు రవీంద్ర, చెంచులక్ష్మి గిరిజన దంపతులను అన్నమయ్య జిల్లా రాజంపేట సమీపంలోని ఓ గ్రామం వద్ద సిమెంటు అచ్చులు తయారీ పనుల కోసం యజమాని వెంకటసుబ్బారెడ్డి తీసు కెళ్లాడు. సరైన కూలి రాకపోవడంతో వారు రాపూరు మండలం మద్దెలమడుగు వద్ద మరోపనిలో చేరి బకాయి నిమిత్తం కొంత మొత్తాన్ని యజమాని సుబ్బారెడ్డికి పంపించారు. అయినా అంగీకరించని వెంకటసుబ్బారెడ్డి ఇటీవల కొందరితో కలిసి మద్దెలమడుగు వద్దకు వచ్చి భర్త రవీంద్రను బలవంతంగా తీసుకెళ్లాడు. వారం గడిచినా భర్తను వదిలిపెట్టకపోవడంతో మనస్థాపానికి గురైన భార్య చెంచులక్ష్మి శనివారం రాత్రి విషద్రావణం తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఆమెను చికిత్స నిమిత్తం మొదట రాపూరు ఆస్పత్రికి తరలించగా, పరిస్థితి విషమించడంతో వైద్యులు తిరుపతి జిల్లా గూడూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ఆమె చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ విషయమై బాధితులు రాపూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయం ప్రజా సంఘాల దృష్టికి వెళ్లడంతో రాష్ట్ర యానాది సంఘం అధ్యక్షుడు కేసీ పెంచలయ్య స్పందించి ఉన్నతాధికారుల దృష్టికి విషయాన్ని తీసుకెళ్లి, బాధితులకు న్యాయం చేయాలని కోరారు. వాస్తవాలు సమగ్రంగా విచారించి వెట్టిచాకిరీ చేయించుకుని గిరిజన మహిళ ఆత్మహత్యకు కారణమైన యజమానిని అరెస్టు చేయాలని, బాధిత కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మృతురాలికి ముగ్గురు పిల్లలున్నారు.

విద్యుత్‌షాక్ తగిలి వ్యక్తి మృతి

చిట్వేలి, అక్టోబరు 13: వెంకటరాజుపల్లె అరుంధతీవాడ వాసి కొత్తూరు నరసింహులు(54) శుక్రవారం ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్ తగిలి మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. ఇంట్లో టీవీని మారుస్తుండగా విద్యుత్‌షాక్ తగిలి నరసింహులు అక్కడికక్కడే మృతిచెందినట్లు తెలిపారు. మృతునికి భార్య రత్నమ్మ, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

పండగ పూట పస్తులే : తులసిరెడ్డి

వేంపల్లె, అక్టోబరు 13: ధరల పెరుగుదలతో పండగ పూట పస్తులే అని ఏపీసీసీముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి అన్నారు. ఆదివారం ఆయన వేంపల్లెలో మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోదీ, రాష్ట్రంలో చంద్రబాబు పాలనలో సరుకుల ధరలు విపరీతంగా పెరిగి నింగినంటుతున్నాయన్నారు. సామాన్యులు పండగపూట పస్తులు ఉండాల్సి వస్తోందన్నారు. వంటనూనెల ధరలు సలసల కాగుతున్నాయన్నారు. కందిపప్పు, ఎండుమిర్చి, వెల్లుల్లి, చింతపండు ధరలు మండిపోతున్నాయన్నారు.

భక్తులకు సదుపాయాలు కల్పించడమే ధ్యేయం

కడప (కల్చరల్), అక్టోబరు 13: వచ్చే కార్తీక మాసంలో (నవంబర్ 2 నుంచి) పొలతలలో మల్లేశ్వరస్వామిని దర్శించుకునే భక్తులకు సదుపాయాలు కల్పించడమే ధ్యేయమని రజక అన్నదాన సేవా సమితి జిల్లా అధ్యక్షుడు ఎం. మల్లయ్య వర్కింగ్ ప్రెసిడెంట్ సి. కొండయ్య, ప్రధానకార్యదర్శి ఎస్. హరిబాబు తెలిపారు. ఆదివారం స్థానిక మృత్యుంజయకుంట సమితి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. భక్తులు సేదతీరేందుకు అనువుగా షెల్టర్ సౌకర్యాలను కూడా ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు.

త్వరితగతిన డ్రైన్స్ సమస్య పరిష్కారం

● టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి

కడప (ఎడ్యుకేషన్), అక్టోబరు 13 : డ్రైనేజీ సమస్య త్వరితగతిన పరిష్కరించాలని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆదివారం దేవునికడప స్మశానం సమీపంలో గల డ్రైనేజీ వ్యవస్థను అధికారులతో పాటు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డ్రైనేజీ వ్యవస్థను గత ప్రభుత్వం అస్తవ్యస్తంగా మార్చిందన్నారు. అధికారులు కూడా దీనిపై నిర్లక్ష్యంగా వ్యవహరించారని తెలిపారు. పూడికలు తీయకపోవడంతో పిచ్చిమొక్కలు పెరిగి మురుగు పారేందుకు వీలు లేకుండా పోయిందన్నారు. తక్షణం పిచ్చిమొక్కలు తొలగించి పూడికలు తీయించి మురుగు పారేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. త్వరలో తుఫాను వచ్చే ప్రమాదం ఉన్నందు వల్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అలాగే రోడ్లు కూడా వేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు.

మద్యం షాపులకు 402 దరఖాస్తులు

వేంపల్లె, అక్టోబరు 13: పులివెందుల ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో 16 మద్యం షాపులకు 402 దరఖాస్తులు వచ్చాయని ఎక్సైజ్ సీఐ చెన్నారెడ్డి తెలిపారు. వేంపల్లెలో ఐదు మద్యం షాపులకు 135, పులివెందులలో ఏడు మద్య షాపులకు 188, లింగాలలో రెండు మద్యం షాపులకు 31 దరఖాస్తులు, వేములలో ఒక మద్య షాపునకు 20, చక్రాయపేటలో ఒక మద్య షాపునకు 28 దరఖాస్తులు వచ్చినట్లు సీఐ తెలిపారు. సోమవారం కలెక్టర్ ఆధ్వర్యంలో లక్కీడిప్ ద్వారా ఎంపిక చేస్తారని సీఐ తెలిపారు.

నాలుగు నెలలుగా అందని వేతనాలు

కడప (సెవెన్‌రోడ్స్), అక్టోబరు 13 : నాలుగు నెలలుగా అందని వేతనాలను చెల్లించాలని ఏఐయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ కేసీ బాదుల్లా డిమాండ్ చేశారు. ఆదివారం హోచిమన్ భవన్‌లో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి లింగన్న సమక్షంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బాదుల్లా మాట్లాడుతూ ప్రభుత్వ స్కూలు స్వీపర్ల సమస్యలు పరిష్కరించాలన్నారు.

వైభవోపేతం.. దసరా ఉత్సవం





కడప నగరంలో బాలపోలేరమ్మ ఊరేగింపులో పాల్గొన్న భక్తులు.. విజయదుర్గ ఆలయంలో ఆకట్టుకున్న వేషధారణలు

కడప (కల్చరల్), అక్టోబరు 13: పది రోజులుగా కన్నుల పండువగా జరిగిన దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు శనివారం నాటి విజయదశమితో వైభవోపేతంగా ముగిశాయి. ముగింపు సందర్భంగా జిల్లాలోని వివిధ ఆలయాలలో కొలువుదీరిన అమ్మవారిని పురవీధుల్లో ఊరేగించి శమీవృక్ష దర్శనం చేయించారు.మిరమిట్లుగొలిపే బాణసంచా కాంతులు, కళాకారుల నృత్యాలు, విచిత్ర వేషధారణలు, గుర్రాలు, వృషభరాజములు భక్తులను ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా కడప నగరంలో కళాకారుల ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అమ్మవారు తొమ్మిది రోజులపాటు వివిధ రూపాలలో దర్శనమిచ్చి చివరిరోజున నగర పురవీధులలో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించిన అమ్మవారికి ఆదివారం రాత్రి పవళింపు సేవ నిర్వహించారు.

నగరంలో కన్నుల పండువగా ఉత్సవాలు

నగరంలో శరన్నవరాత్రి, దసరా ఉత్సవాలు కడు భక్తి శ్రద్ధలతో కన్నుల పండువగా ముగిశాయి. నగరంలోని వివిధ అమ్మవారి ఆలయాల నిర్వాహకులు పోటీ పడి మరీ ముగింపు ఉత్సవాలు నిర్వహించారు. కడప నడిబొడ్డున ఆకాశమే హద్దుగా బాణసంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు.

విజయదుర్గాదేవి ఆలయంలో...

కడప నగర బిల్టప్ సర్కిల్ సమీపంలోని విజయదుర్గాదేవి ఆలయంలో శనివారం తెల్లవారుజామున 3.30 గంటలకు అమ్మవారికి అష్టోత్తర (108) కలశములతో విశేష అభిషేకం నిర్వహించారు. ఉదయం 9.30 గంటలకు అమ్మవారు విజయదుర్గాదేవి అలంకారంలో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. సాయంత్రం 3 గంటలకు శమీవృక్ష సందర్శనం చేశారు. రాత్రి 8 గంటలకు ఆలయం నుంచి అమ్మవారిని మంగళవాయిద్యాలు, బాణసంచా పేల్చుతూ, వివిధ వేషధారణల నడుమ నగరోత్సవం నిర్వహించారు. ఆ మేరకు అల్మాస్‌పేట, చిలకలబావి, బెల్లంమండీవీధి, గడ్డిబజార్, మార్కెట్, బీకెఎం స్ట్రీట్, పొట్టిశ్రీరాములు సర్కిల్, 1 టౌన్ గాంధీబొమ్మ, 2వ గాంధీబొమ్మ, మోచంపేట సర్కిల్, బిల్టప్ సర్కిల్, మీదుగా తిరిగి విజయదుర్గాదేవి ఆలయం వరకు ఊరేగింపు నయనానందకరంగా సాగింది.

వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో...

నగరంలోని అమ్మవారిశాల వీధిలో వెలసిన వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో శనివారం ఉదయం 7 గంటలకు అమ్మవారికి పంచామృతాభిషేకం, సహస్రనామార్చన, అనంతరం మూలవర్లకు ఆర్యవైశ్య సంఘం కమిటీ గౌరవ ఉపాధ్యక్షులు దేవతి శంకరయ్య దంపతులు పట్టువస్త్ర అలంకరణ సేవ నిర్వహించారు. ఉదయం 10 గంటలకు భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు. సాయంత్రం 4.30 శమీదర్శనమం చేశారు. సాయంత్రం 6 గంటలకు ఆలయం నుంచి పుర వీ ధుల గుండా అమ్మవారి నగరోత్సవం నిర్వహించారు. ఇందు లో తమిళనాడు కీలుగుర్రాలు, విచిత్ర వేషధారణలు, కళ్ల మిరుమిట్లుగొలిపే రంగురంగుల టపాలసుల సొబగులు భక్తులను ఎంతగానో అలరించాయి. దసరా ఉత్సవ కమిటీ చైర్మన్ పరిటాల వెంకటరమణయ్య పర్యవేక్షణలో అమ్మవారి గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు.

రాజరాజేశ్వరీదేవి ఆలయంలో...

అకులవీధిలో వెలసిన రాజరాజేశ్వరీదేవి ఆలయంలో దసరా ఉత్సవాలు శనివారంతో ఘనంగా ముగిశాయి. శమీవృక్ష సందర్శనం, నగరోత్సవాలు ప్రజలను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆలయ ప్రధాన అర్చకులు పిడతల గోపాలకృష్ణశర్మ నేతృత్వంలో ఏకాదశి పాన్పు సేవ నిర్వహించారు.

సత్యనారాయణ స్వామి ఆలయంలో...

గడ్డిబజార్‌లో వెలసిన సత్యనారాయణ స్వామి ఆలయంలో దసరా ఉత్సవాలు శనివారం అత్యంత వైభవంగా ముగిశాయి. ఆలయ ప్రధాన అర్చకులు విజయ్‌బట్టర్ సారధ్యంలో సాయంత్రం 6 గంటల నుంచి పురవీధులలో అమ్మవారి గ్రామోత్సవం శోభాయంగా సాగింది. ఎర్రముక్కపల్లెలో వెలసిన చౌడేశ్వరీదేవి ఆలయంలో, గడ్డిబజార్‌లో వెలసిన బాలాజీ ఆలయంలో, నబీకోటలో వెలసిన రామలింగచౌడేశ్వరదేవి ఆలయంలో..హనుమప్పవీధిలో వెలసిన నడివీధి గంగమ్మతల్లి ఆలయంలో అమ్మవారి గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.

వైభవంగా చౌడేశ్వరిదేవి గ్రామోత్సవం

చెన్నూరు, అక్టోబరు 13 : దసరా ఉత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి జరిగిన రామలింగ చౌడేశ్వరి గ్రామోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన ప్రజలతో చెన్నూరు పురవీధులు కిక్కిరిసిపోయాయి. రాత్రి 10 గంటలకు అమ్మవారిని గర్భగుడి నుంచి విజయలక్ష్మీదేవి అలంకారంలో బయటికి తీసుకువచ్చేటప్పు డు మొదటగా అమ్మవారికి కడవ బోనాన్ని భక్తులు తలపై ఉంచుకుని అమ్మవారి కీర్తనలు గానం చేస్తూ ఆదిశక్తి పరాశక్తి అంటూ గర్భగడి నుంచి బయటికి రాగా వెను వెంటనే అమ్మవారికి బలి ఇచ్చారు. అనంతరం సేవ కుమార్‌లు ఓం నమ్మశ్శివాయ, హరహరశివా అంటూ జంజాలు (పదునైన కత్తులతో) తమ ఎదలపై పొడుచుకుని రక్తం బయటికి రాగా అమ్మవారికి తర్పణగా బయట వదులుతూ అమ్మవారి ఊరేగింపుకు ఆహ్వానం పలికారు. అనంతరం ఆసీనురాలైన చౌడేశ్వరిదేవిని మంగళవాయిద్యాల నడుమ బాణసంచా పేలు స్తూ ప్రభల విన్యాసాలతో చెన్నూరు పువీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. ఓ వైపు కోలాటం, మరో వైపు చెక్కభజన, మరో వైపు ప్రభల విన్యాసాలతో శనివారం రాత్రి 10 నుంచి ఆదివారం ఉదయం 10గంటల వరకు వీధవీధినా అమ్మవారిని ఊరేగించారు.

ఘనంగా కన్యకాపరమేశ్వరిదేవి గ్రామోత్సవం

కమలాపురం రూరల్, అక్టోబరు 13 : నగర పంచాయతీపరిధిలో వెలసిన కన్యకాపరమేశ్వరి దేవి ఆలయంలో దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. చివరి రోజు విజయదశమి సందర్భంగాఅమ్మవారి బ్రహ్మోత్సవం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఆదివారం సాయంత్రం మొదలైన అమ్మవారి గ్రామోత్సవం సోమవారం తెల్లవారుజామునకు ముగిసింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి గ్రామోత్సవాన్ని విజయవంతం చేశారు. అదే విధంగా భక్తులు అమ్మవారిని దర్శించి కాయ కర్పూరం సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు. అదే విధంగా స్థానిక అయ్యప్పస్వామి ఆలయ ఆవరణంలో దసరా ఉత్సవాల సందర్భంగా మహాకాళి అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్టించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

వేంపల్లెలో ఘనంగా విజయదశమి

వేంపల్లె, అక్టోబరు 13: వేంపల్లెలో విజయదశమి వేడకను ఘనంగా జరుపుకున్నారు. స్థానిక అమ్మవారిశాలలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవీ కన్యకపరామేశ్వరికి పూజలు చేశారు. ఒక్కో రోజు ఒక్కో అలంకరణ చేసి పూజలు గావించారు. శనివారం తెల్లవారుజామున అమ్మవారికి గోధుమపిండితో తయారు చేసిన దున్నపోతును బలిచ్చే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. దున్నపోతును నరికే అవకాశం కోసం అమ్మవారికి రూ.41వేలు చెల్లించి దొంతు సుమన్ దక్కించుకున్నారు. అమ్మవారిని ప్రత్యేక అలంకరణ చేసి పూజలు చేశారు.















పులివెందుల శిల్పారామంలో శాస్త్రీయ నృత్యం చేస్తున్న రాజా కళానిలయం బృందం

పులివెందులలో..

పులివెందుల రూరల్, అక్టోబరు 13: పట్టణంలోని శిల్పారామం, ఉలిమెల్ల లేక్ ఫ్రంట్‌లో దసరా ఉత్సవాల సందర్భంగా మూడు రోజుల పాటు నిర్వహించిన కార్యక్రమాలు విజయవంతమైనట్లు పరిపాలన అధికారి సుధాకర్ తెలిపారు. కార్యక్రమాలకు ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి, పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవిలు హాజరై కార్యక్రమాలను ప్రారంభించారు. అలాగే ప్రముఖ హాస్యనటులు (అబ్బాటివి) డాక్టర్ హరిప్రసాద్ హాజరై తమ కామెడీతో ప్రేక్షకులను నవ్వించారు. వ్యవసాయం అనే ఇండిపెండెంట్ ఫిల్మ్ ట్రైలర్‌ను విడుదల చేశారు. అలాగే మూడు రోజుల పాటు నిర్వహించిన నృత్య ప్ర దర్శనలతో పాటు ఏర్పాటుచేసిన కార్యక్రమాల సందర్భంగా శిల్పారామం, ఉలిమెల్ల లేక్‌ఫ్రంట్‌లు సందర్శకులతో కిటకిటలాడాయి. కార్యక్రమాలను విజయవంతం చేసిన ప్రేక్షకులకు ఏఓ సుధాకర్ కృతజ్ఞతలు తెలిపారు.



వ్యవసాయం ట్రైలర్ విడుదల సందర్భంగా మాట్లాడుతున్న బీటెక్ రవి, పక్కన అబ్బాటివి డాక్టర్ హరిప్రసాద్

నేడు మండల పరిషత్ సర్వసభ్యసమావేశం

చెన్నూరు, అక్టోబరు 13 : స్థానిక మండల పరిషత్ సర్వసభ్యసమావేశం ఎంపీడీవో సభాభవనంలో ఎంపీపీ చీర్ల సురేశ్‌యాదవ్ అధ్వర్యంలో ఉదయం 10.30కు జరుగుతుందని ఎంపీడీవో కిరణ్‌మోహన్‌రావు తెలిపారు .ఈ సమావేశంలో పలు అభివృద్ధి పనులపై పెండింగులో ఉన్న పనులపై చర్చించడం జరుగుతుందని, మండలంలోని అన్ని శాఖల అధికారులు తప్పక హాజరుకావాలని ఆయన తెలిపారు.

నేడు రోడ్డుకు ఎమ్మెల్యే శంకుస్థాపన

మండలంలోని రామనపల్లెకు చిన్నమాచుపల్లె హైవే రహదారి నుంచి గ్రామానికి వెళ్లే రోడ్డుకు రూ.80లక్షలు నిధులు మంజూరు కాగా ఆరోడ్డు పనులు ప్రారంభోత్సవాన్ని సోమవారం ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి ప్రారంభిస్తున్నట్లు అగ్రామ సీనియర్ టీడీపీ నేత, మాజీ రాష్ట్ర తెలుగు రైతు ఉపాధ్యక్షులు ఎల్.రమణారెడ్డి తెలిపారు. కార్యక్రమానికి టీడీపీ నేతలు హాజరు కావాలన్నారు.

గండి పనులను వేగవంతం చేయండి

చక్రాయపేట, అక్టోబరు 13: గండి దేవస్థానంలో జరిగే నూతన ఆలయ పనులు వేగవంతం చేసి త్వరలో ప్రారంభానికి సిద్దం చేయాలని టీడీపీ మండల ఇన్‌చార్జి తాళ్లపల్లె మహేశ్వరరెడ్డి కోరారు. ఆయన శనివారం గండి వీరాంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య ఆహ్వానించగా ప్రధాన అర్చకులు కేసరి, గోపాలస్వాములు ఆయనకు ఘనంగా పూజలు చేసి ఆలయ మర్యాదలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆలయం పనులు ఇంకా ఎన్నిరోజులు పడతాయి, ఎక్కువ మందిని పెట్టి పనులుపూర్తి చేయాలని తెలిపారు. టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి పట్టెం అశోక్, టీడీపీ మండల ఉపాధ్యక్షుడు ఎద్దుల చంద్ర, సిద్దారెడ్డిగారిపల్లె గణేష్‌రెడ్డి, శంకర్‌రెడ్డిలతో పాటు యోగీశ్వర్‌రెడ్డి, అమర్, కార్యకర్తలు శ్రావణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

గండి అభివృద్ధికి కృషి: ఎమ్మెల్సీ

చక్రాయపేట, అక్టోబరు 13: గండి వీరాంజనేయస్వామి అభివృద్ధికి తన వంతు కృషిచేస్తానని, ఆలయ పనులు పూర్తిచేయాలని అధికారులను కోరారు. శనివారం ఆయన తన కుటుంబ సమేతంతో అంజన్నను దర్శించుకున్నారు. ప్రధాన అర్చకులు కేసరిపూర్ణఫలంతో స్వాగతం పలికి ఘనంగా పూజలు చేసి శాలువలు కప్పి, దండలు వేసి ఆశీర్వచనాలు చేశారు.

ట్రిపుల్‌ఐటీ అధ్యాపకుడికి ప్రతిభ అవార్డు

వేంపల్లె, అక్టోబరు 13: ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో కెమిస్ట్రీ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న పులివెందులకు చెందిన డాక్టర్ వి.ప్రభాకర్‌కు డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం నేషనల్ ప్రతిభ అవార్డు లభించింది. ట్రిపుల్‌ఐటీలో అధ్యాపకుడిగా పనిచేస్తున్న ఆయనను గుర్తించి ఈ అవార్డుకు ఎంపిక చేశారు.

విగ్రహావిష్కరణను విజయవంతం చేయండి

సింహాద్రిపురం, అక్టోబరు 13: పులివెందుల పట్టణంలో ఏర్పాటు చేసిన మహర్షి వాల్మీకి విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా వాల్మీకి సంఘం అధ్యక్షుడు సాకే ఆదినారాయణ వాల్మీకి సోదరులకు పిలుపునిచ్చారు.కాయ కర్పూరములతోపాటు, బోనం తీసుకురావలెనని ఆయన కోరారు.

560 బియ్యం ప్యాకెట్లు స్వాధీనం

సికెదిన్నె, అక్టోబరు 13: 560 బియ్యం ప్యాకెట్లు పట్టుకున్నట్లు సికెదిన్నె పోలీసులు తెలిపారు. పవర్‌గ్రిడ్ వద్ద ఉన్న చెక్‌పోస్టు తనిఖీల్లో లారీలో తరలిస్తున్న 560 బియ్యం ప్యాకెట్లు పట్టుకున్నామని, రెవెన్యూ శాఖవారు ఈ బియ్యాన్ని నిర్ధారించాక కేసు నమోదు చేస్తామన్నారు.

కమిటీని ప్రకటించాలి: ఆర్‌జేయూపీ



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు గునిశెట్టి శ్రీనివాసులు

కడప (ఎడ్యుకేషన్), అక్టోబరు 13 : పీఆర్సీపై ప్రభుత్వం కమిటీని ప్రకటించాలని ఆర్‌జేయూపీ రాష్ట్ర అధ్యక్షుడు గునిశెట్టి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఆదివారం కడప నగరం టీచర్స్ హోంలో జిల్లా అధ్యక్షుడు ప్రసాదరావు అధ్యక్షతన ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల నూతన వేతన సవరణకు కమిటీని ప్రకటించి సీఆర్సీ ప్రక్రియ ప్రారంభించాలన్నారు. తాత్కాలికంగా ఐఆర్ ప్రకటించాలని కోరారు. అధికార ప్రతినిధి వీరబ్రహ్మం మాట్లాడుతూ పెండింగు బకాయిలు వెంటనే విడుదలచేయాలని దీర్ఘకాలికంగా పెండింగులో ఉన్న ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని కోరారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులరెడ్డి మాట్లాడుతూ జీఓ 117 రద్దు చేసి ప్రాథమిక తరగతులు వేరుగా ప్రాథమిక విభాగంలో కొనసాగించాలని లేదంటే ప్రాథమిక విద్య నిర్వీర్యమవుతుందన్నారు. సీనియర్ నాయకులు భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయుల డైట్ జెఎల్, పదన్నతలకు మార్గం సుగమం చేయాలన్నారు. డైట్‌బీఎడ్ కళాశాలను బలోపేతం చేసి ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయాలని కోరారు. టీచర్స్ హోం ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య, సీనియర్ నాయకులు రెడ్డన్న, రామక్రిష్ణారెడ్డి, వీరన్న, సుదర్శనరెడ్డి పాల్గొన్నారు.

శ్రీసత్యసాయి గోకుల్ డెంటల్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే




గోకుల్ డెంటల్ క్లినిక్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే మాధవి, శ్రీనివాసరెడ్డి, డాక్టర్ సూర్యప్రకాశ్

కడప (సెవెన్‌రోడ్స్), అక్టోబరు 13 : కడప నగరం నడిబొడ్డున గోకుల్ కాంప్లెక్స్‌లో శ్రీసత్యసాయి గోకుల్ డెంటల్ సూపర్ స్పెషాలిటీ డిజిటల్ క్లినిక్‌ను ఎమ్మెల్యే మాధవీరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డాక్టర్ నందా సూర్యప్రకాశ్ గత 40 సంవత్సరాలుగా దంత వైద్యరంగంలో రాణిస్తూ అత్యంత ఆధునికమైన అన్నిరకాల దంత వైద్యచికిత్సలను కడప ప్రజలకు అందిస్తున్నారన్నారు. డాక్టర్ సూర్యప్రకాశ్ మాట్లాడుతూ దంత వైద్యచికిత్సకు సంబంధించి అన్ని రకాలైన చికిత్సలు మరియు అత్యాధునికమైన పద్ధతుల్లో స్పెషలిస్ట్ వైద్యుల ఆధ్వర్యంలో శ్రీ సత్యసాయి గోకుల్ డెంటల్ సూపర్ స్పెషాలిటీ డిజిటల్ క్లినిక్‌ను ప్రారంభించారన్నారు. ఇక్కడ ఆధునికమైన డెంటల్ స్కానింగ్, డిజిటల్ ఎక్స్‌రే మొదలైన సదుపాయాలన్నీ లభిస్తాయని, కడప పట్టణ ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆధునిక దంత వైద్యచికిత్స అందుకోవాలని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులకు లబ్ధి చేకూరే విధంగా మెడికల్ రీయింబర్స్‌మెంటు మొదలైన సదుపాయాలను కూడా తమ క్లినిక్ నందు అందిస్తున్నామని ఈ సందర్భంగా తెలిపారు.

ఘనంగా మారెమ్మకు పూజలు

పులివెందుల, అక్టోబరు 13: తొండూరు మండలంలోని సైదాపురం గ్రామంలో వెలసిన మారెమ్మ తల్లి అమ్మవారికి ఘనంగా పూజలు నిర్వహించారు. దసరా ఉత్సవాల సందర్భంగా ప్రతిరోజు అమ్మవారికి వివిధ అలంకరణలు చేశారు. ఆదివారం ప్రత్యేక అలంకరణలో ఉన్న మారెమ్మ తల్లిని భక్తులు దర్శించుకొని అమ్మవారికి కాయకర్పూరం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే వరసిద్ధి బృందంచే నిర్వహించిన కోలాట ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. దసరా ఉత్సవాలు గ్రామ ప్రజలు అంతా కలిసి ఘనంగా నిర్వహించారు.

ఎమ్మెల్యే కృషితో చెరువులకు నీరు మళ్లింపు



ఎక్సకవేటర్ సాయంతో చదిపిరాళ్ల చెరువుకు నీరు మళ్లింపు

కమలాపురం రూరల్, అక్టోబరు 13:ఎమ్మెల్యే క్రిష్ణచైతన్యరెడ్డి కృషితో పాపాఘ్నినది నుంచి కమలాపురం, చదిపిరాళ్ల చెరువులకు నీటిని మళ్లిస్తున్నామని మాజీ ఉప మండల అధ్యక్షుడు వాసుదేవరెడ్డి తెలిపారు. ఆదివారం మండల పరిధిలోని లేటపల్లె గ్రామ సమీపంలో ఉన్న పాపాఘ్నినది నుంచి చదిపిరాళ్ల కమలాపురం చెరువుకు కట్టుకొమ్మ ద్వారా నీటిని మళ్లించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పుత్తా నరసింహారెడ్డి ఆయన తనయుడు కమలాపురం ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి ఆర్థిక సహకారంతో కమలాపురం చదిపిరాళ్ల గ్రామాల ప్రజలకు పాపాఘ్నినది నుంచి తాగునీటిని మళ్లిస్తున్నామన్నారు. దీంతో కమలాపురం చదిపిరాళ్ల చెరువు కింద దాదాపు 2వేల ఎకరాలు సాగులోకి వస్తుందన్నారు. అదే విధంగా చదిపిరాళ్ల, గొల్లపల్లె కమలాపురం గోపులాపురం మీరాపురం తదితర గ్రామాలకు తాగునీరు కూడా పుష్కలంగా ఉంటుందన్నారు. నియోజకవర్గం అభివృద్ధి కోసం ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి కృషి చేస్తున్నారని ఆయనకు అండగా ప్రజలందరూ నిలవాలని కోరారు.

మట్టి తవ్వకాలను అడ్డుకున్న స్థానికులు

మైదుకూరు రూరల్ అక్టోబరు 13 : అక్రమంగా తవ్వకాలు జరుపుతున్నారని ఆదివారం స్థానికులు లోడింగ్ చేస్తున్న వాహనాలను అడ్డుకొని టిప్పర్ ,యంత్రాలను అక్కడ నుంచి పంపించివేశారు. ఓ ప్రైవేటు సంస్థ గత ప్రభుత్వం నుంచే ఏడాదిగా మట్టి తవ్వకొని తోలుకొనేందుకు తమకు అనుమతులు ఉన్నాయంటూ, ట్రాక్టర్‌కు 250 రూపాయలు చొప్పున చలానా రూపంలో వసూలు చేస్తున్నామని తెలిపారు. కాగ మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ ప్రజా అవసరాల నిమిత్తం తహసీల్దార్ అనుమతితో మట్టిని ఉచితంగా తోలుకోండి అని తెలిపారు.కాని నేడు ప్రైవేటు సంస్థ పేరులో మట్టి తోలుకోవడంపై ఆగ్రహించిన స్థానికులు అక్రమ తవ్వకాలు అని అడ్డుకొన్నారు. ఇదే విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళతామని తెలిపారు.

వైభవంగా విజయదశమి

జమ్మలమడుగు, అక్టోబరు 13: జమ్మలమడుగులో శనివారం రాత్రి వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి అమ్మవారు విజయదశమిని పురస్కరించుకుని వాసవాంబదేవి అలంకారంలో రాత్రి 11 గంటల నుంచి అమ్మవారి గ్రామోత్సవం వైభవంగా జరిగింది. అలాగే నాగులకట్ట చౌడేశ్వరీదేవాలయం, కన్నెలూరులోని చౌడేశ్వరీదేవి అమ్మవారు, గంగమ్మ దేవాలయం, శ్రీ ప్రసన్నవెంకటేశ్వరస్వామి ఆలయం, ముద్దనూరు రోడ్డులోని సాయిబాబా ఆలయంలో శ్రీ రాజరాజేశ్వరీదేవి అమ్మవారు తదితర ప్రాంతాల్లో దసరా ఉత్సవాలు నిర్వహించారు. కన్యకాపరమేశ్వరీ అమ్మవారు గ్రామోత్సవం వెంట కోలాటం, బాణసంచా, డ్రమ్స్ తదితర కార్యక్రమాలతో పట్టణం భక్తులతో కిటకిటలాడింది. అలాగే అంబాభవానీ దేవాలయంవద్ద భక్తులు పూజలు చేసి మొక్కుకున్నారు. కాగా వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో ఆదివారం ఉదయం వసంతోత్సవం ఘనంగా నిర్వహించారు. రాత్రి అమ్మవారి పాన్పు సేవతో నవరాత్రులు విజయదశమి పండుగ కార్యక్రమాలు ముగిశాయి. అలాగే జమ్మలమడుగులో దసరా విజయదశమి పురస్కరించుకుని తొగటవీర క్షత్రియులు నాగులకట్ట చౌడేశ్వరీదేవి అమ్మవారి ప్రతిరూపమైన జ్యోతులను శనివారం రాత్రి 12 గంటల నుంచి ఆదివారం ఉదయం 11 గంటల వరకు పట్టణంలో జ్యోతులను ఊరేగింపు చేశారు.

ఎర్రగుంట్ల..: దసరా శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా చివరిరోజైన శనివారం విజయదశమి వేడుకలు ఎర్రగుంట్లలో వైభవంగా జరిగాయి. శనివారం సాయంత్రం అమ్మవారిశాలనుంచి శమీదర్శనం కార్యక్రమం నిర్వహించారు. రాత్రి గ్రామోత్సవం తెల్లార్లు నిర్వహించారు. బాణా సంచాపేలుస్తూ అమ్మవారి ఊరేగింపు సాగింది. ఏరువాకగంగమ్మ అమ్మవారు శమీదర్శనానికి పల్లకీలో గ్రామోత్సవంగా మార్కెట్‌యార్డులోకి వెళ్లారు. నడిపూరు కోలాట బృందం వేసిన కోలాటం అందరినీ ఆకట్టుకుంది. జమ్మిచెట్టుకు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. చౌడేశ్వరీదేవి అమ్మవారు ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన రథంలో శమీదర్శనానికి వెళ్లారు. ఊరేగింపులో వివిధరకాల దేవతల వేషధారణ అందరినీ ఆకట్టుకుంది. మహేశ్వర నగర్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహం ఊరేగింపుగా వెళ్లి శమీదర్శనం అనంతరం పూజ నిర్వహించారు. చిలమకూరులోను, పెద్దనపాడు, మరిన్ని చోట్ల దసరా ఉత్సవాలు నిర్వహించారు.

కొండాపురం..: మండలంలో పది రోజుల పాటు జరిగిన దసరా ఉత్సవాలు శనివారం రాత్రి ఘనంగా ముగిశాయి. పట్టణంలోని అమ్మవారిశాలలో, రాఘవేంద్ర స్వామి ఆలయం, దత్తాపురం పెద్దమ్మ గుడిలో పదిరోజుల పాటు వివిధ అలంకారాలతో ఘనంగా పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

బ్రహ్మంగారిమఠం..: బ్రహ్మంగారిమఠంలో తొమ్మిదోరోజు శనివారం దశమి సందర్భంగా వీరబ్రహ్మేంద్రస్వామి, జగన్మాత ఈశ్వరీదేవి అమ్మవారు ప్రత్యేకంగా అలంకరణ అయి జమ్మిచెట్టు వద్దకు చేరుకుని అక్కడ శమీపూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వాహకులు చేపట్టారు.



ప్రొద్దుటూరులో దసరా ఉత్సవాల్లో పాల్గొన్న భారీ భక్తజనం

అలరించిన బండలాగుడు పోటీలు..: బ్రహ్మంగారిమఠం మండలంలోని పలుగురాళ్లపల్లె పంచాయతీ పి.కొత్తపల్లె గ్రామ సమీపంలో కోడూరు దుర్గాంబదేవి శరన్నవరాత్రి సందర్భంగా కమిటీ ఆధ్వర్యం లో బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలు పుట్టా ఆనందయాదవ్, పుట్టా ప్రభాకర్‌యాదవ్ ప్రారంభించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు చెన్నుపల్లిసుబ్బారెడ్డి, యల్లటూరు సాంబశివారెడ్డి, పూజా శివాయాదవ్, పుట్ట వెంకట మధుకుమార్, బుజ్జి, కొండా రమణరెడ్డి, బాల దుగ్గయ్య బసిరెడ్డి దుగ్గిరెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా వసంతోత్సవం..: బ్రహ్మంగారిమఠం మండల కేంద్రంలోని శ్రీకన్యకాపరమేశ్వరి దేవస్థానం నందు గత తొమ్మిదిరోజుల నుండి దసరా మహోత్సవాలను పురస్కరించుకుని ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఉత్సవాలు ఘనంగా ముగియడంతో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వసంతోత్సవాలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఇంటింటికీ వెళ్లి గ్రామంలోని పురవీధుల గుండా కన్యకాపరమేశ్వరిదేవి అమ్మవారు ఊరేగింపుగా వెళ్లారు. అమ్మవారికి కాయకర్పూరాలు గ్రామ ప్రజలందరూ సమర్పించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు టన్నూరు క్రిష్ణమూర్తి, ఆర్యవైశ్య కమిటీ సభ్యులు, యువజన సంఘం ప్రజలు పాల్గొన్నారు.

మైదుకూరు రూరల్..: మైదుకూరులో దసరా ఉత్సవాలను భక్తులు ఘనంగా నిర్వహించారు. అమ్మవారిశాలలో శనివారం విజయలక్ష్మీదేవి అలంకారం,మాధవరాయ స్వామి ఆలయంలో రాజరాజేశ్వరీదేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆదివారం బాణా సంచాలతో,మిరుమిట్లు గొలిపే విద్యుత్ కాంతులతో కన్నుల పండువగా జరిగింది. గ్రామోత్సవంలో అమ్మవారి వెంట భక్తులు స్థానిక మహిళలచే కోలాటాలు,కేరళ వారిచే బ్యాండ్ వాయిద్యాలతో ప్రజలను అలరించారు .ఆదివారం అమ్మవారి పాన్పుసేవతో దసర ఉత్సవాలు ముగిశాయి.

రాజరాజేశ్వరి అలంకారంలో అమ్మవారు

కాశినాయన..: దసరా పండుగ సందర్భంగా నర్సాపురంలోని శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయం, నూతనంగా నిర్మించిన శివాలయాల్లో శనివారం అమ్మవారు రాజ రాజేశ్వరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం సాయంకాలం అమ్మవారు శమీ దర్శనానికి తరలివెళ్లారు. రాత్రికి గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

పోరుమామిళ్ల..: దసరా నవరాత్రుల ఉత్సవాల సందర్భంగా పోరుమామిళ్లలోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో శనివారం రాత్రి విజయలక్ష్మీదేవి అలంకారాన్ని అలంకరించారు. అలాగే రాత్రి అమ్మవారి మెరవణిని పురవీధుల్లో ఊరేగించి గ్రామోత్సవాన్ని నిర్వహించారు.

ప్రొద్దుటూరు టౌన్..: విజయదశమి పర్వదినం సందర్భంగా అమ్మవారిశాలలో వసంతోత్సవం ఘనంగా నిర్వహించారు. శనివారం దసరా ఉత్సవాలు ముగియడంతో ఆదివారం ఉదయం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్యులు రంగులు చల్లుకుంటూ వసంతోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సభ నిర్వాహకులు, ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

ఖాజీపేట..: దసరా ఉత్సవాలు ముగింపు సందర్భంగా శ్రీ కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారు విజయలక్ష్మీ దేవి అలంకారంలో దర్శనమిచ్చారు. చివరి రోజు కావడంతో మండల పరిధిలోని పలు గ్రామాల నుండి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనడంతో అమ్మవారిశాల కిటకిటలాడింది. వచ్చిన భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా ఆలయ కమిటీ ఛైర్మన్ దరిశ గంగిశెట్టి పర్యవేక్షించారు. అనంతరం రాత్రి అమ్మవారి గ్రామోత్సవం బాణసంచా మధ్య మంగళవాయిద్యాలతో, కళాకారుల నృత్యాలతో భారీగా ఊరేగింపు నిర్వహించారు. అలాగే బస్టాండు కూడలిలో కాల్చిన బాణసంచా పలువురిని ఆకట్టుకుంది.



జమ్మలమడుగులో జ్యోతులతో ఊరేగింపుగా వెళుతున్న తొగటవీర క్షత్రియులు



ఎర్రగుంట్లలో కోలాటం వేస్తున్న దృశ్యం, కొండాపురంలో పెద్దగుడిలో అమ్మవారు




బీమఠంలో వీరబ్రహ్మేంద్రస్వామి, మైదుకూరు.. విజయలక్ష్మీదేవి అలంకారంలో వాసవీమాత









ప్రొద్దుటూరు..వసంతోత్సవంలో వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి అమ్మవారు, అమ్మవారి దర్శనం కోసం కొర్రపాడు రోడ్డులో వేచి ఉన్న భక్తులు, మైదుకూరు..స్థానిక మహిళల కోలాటం, ఖాజీపేట.. గ్రామోత్సవంలో అమ్మవారు



ఐకమత్యంతోనే అభివృద్ధి సాధ్యం



ఉద్యోగిని సత్కరిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్, అక్టోబరు 13: దూదేకుల సామాజిక వర్గం వారు ఐకమత్యంగా ఉన్నప్పుడే అభివృద్ధి సాధించగలరని ఏపీ నూర్‌బాష దూదేకుల ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పగిడాల సిద్దయ్య తెలిపారు. ఆదివారం గౌతమీ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో అసోసియేషన్ ఆధ్వర్యంలో దూదేకుల సామాజికవర్గానికి చెందిన ఉద్యోగులను ఘనంగా సత్కరించారు.అనంతరం వివిధ శాఖలలో ఉన్నత ఉద్యోగాలు చేస్తున్న దూదేకుల ఉద్యోగులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు కన్నయ్య, రిటైర్డు డీఎస్పీ మహబూబ్‌బాష, నూర్‌బాష దూదేకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పీర్‌మహమ్మద్, ప్రధాన కార్యదర్శి సలీం, కోశాధికారి దస్తగిరి, నూర్‌మహమ్మద్, లాల్‌నజీర్, ఖాదర్‌బాష, కిశోర్‌బాబు, షేక్షావలి, నాగరాజు, డాక్టర్ ఉమర్‌ముక్తార్, మహబూబ్‌బాష, తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక విద్య నిర్వీర్యం చేయవద్దు

పోరుమామిళ్ల, అక్టోబరు 13 : సంస్కరణల పేరుతో ప్రాథమిక విద్యను నిర్వీర్యంచే చేయవద్దని ఎస్టీయూ రాష్ట్ర అద నపు ప్రధాన కార్యదర్శి రమణా రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి సంగమేశ్వరరెడ్డి అన్నారు. ఆదివారం పోరుమామిళ్ల ఎస్టీయూ భవన్‌లో రీజనల్ కన్వీనరు క్రిష్టా రెడ్డి ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆ కార్యక్రమంలో రాష్ట్రకన్వీనరు శివారెడ్డి, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు పుల్లారెడ్డి,సీనియర్ నాయకులు రంగారెడ్డి, వాకాచంద్రశేఖర్, బాలరాజు, కస్తూరి శ్రీనివాసులు, ప్రతాప్‌రెడ్డి, కుళాయిబాబు, పుల్లయ్యపాల్గొన్నారు.

నిత్యావసరాలు పంపిణీ

బ్రహ్మంగారిమఠం, అక్టోబరు 13 : మండల కేంద్రంలోని 12 నిరుపేద కుటుంబాలకు 12 రకాల నిత్యావసర వస్తువులను పంపిణీ చేసినట్లు కర్నూలు జిల్లా సీఐ లెక్కల విజయలక్ష్మి, ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డి తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలోని స్థానిక శ్రీకృష్ణదేవరాయ బలిజ అన్నదాన సత్రం లో తమ కుమార్తె మనస్వినిరెడ్డి 12వ జన్మదిన సందర్భంగా పేదలకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేసినట్లు తెలిపారు.


ఉత్సాహంగా బండలాగుడు పోటీలు



బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

అట్లూరు, అక్టోబరు 13 : మండలంలోని అట్లూరు క్రాస్‌రోడ్డు వెలసిన అవధూత అబ్బిరెడ్డి స్వామి దసరా ఉత్సవాల్లో భాగంగా ఆదివారం బండలాగుడు ఎద్దుల పోటీలు ఆలయ కమిటీ ధర్మకర్త రెడ్డప్పరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. బండలాగుడు ఎద్దుల పోటీలలో బద్వేలు మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, బద్వేలు బీజేపీ నేత బొజ్జా రోశన్న పాల్గొన్నారు. బండలాగుడు ఎద్దుపోటీల్లో ప్రథమస్థానంలో నంద్యాల జిల్లా సిరివెళ్ల మండలం, దుంపలమాను గ్రామం కుందూరు రాంగోపాల్‌రెడ్డి ఎద్దు నిలిచాయి. వీరికి మంచూరు సూర్యనారా యణరెడ్డి రూ.70,116లు అందించారు. మైదుకూరుకు చెందిన కుర్ర వెంకటేశ్ ఎద్దు రెండోస్థానంలో నిలిచాయి. పాలకొండు రాజశేఖర్‌రెడ్డి రూ.50,116లు అందించారు. గుడిలో అరవ శ్రీనివాసులరెడ్డి ధ్వజస్తంభ దాతగా బహుకరించారు. టీడీపీ నాయకులు నందగోపాల్‌రెడ్డి, పోతిరెడ్డిరెడ్డప్ప రెడ్డి, మండల నాయకులు మల్లికార్జునరెడ్డి, సాంబశివారెడ్డి, అమర్‌నాథరెడ్డి, జయక్రిష్ణారెడ్డి, బయనపల్లె శివరామిరెడ్డి, బయనపల్లె సుబ్బారెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, వేణుగోపాలరెడ్డి, మీనాక్షిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, కొల్లు సుబ్బారెడ్డి, చిలిపి క్రిష్ణారెడ్డి, చింతు నరసింహారెడ్డి, పెద్దరామసుబ్బారెడ్డి, జేసీబీ సుబ్బారెడ్డి, పరశురాం, అల్లం వెంకటసుబ్బయ్య, నరసింహులు, ఈశ్వర్‌రెడ్డి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఎంసీ ఫర్నీచర్స్ ఇంటీరియర్స్ ప్రారంభం



ఎంసీ ఫర్నీచర్స్‌ను ప్రారంభిస్తున్న బుశెట్టి రామ్మోహన్

ప్రొద్దుటూరు, అక్టోబరు 13 : అధునాతన ఫర్నీ చర్స్ అన్నీ ఎంసీ ఫర్నీచర్స్‌లో అందు బాటులో వుంటాయని ప్రముఖ వ్యాపారవేత్త బుశెట్టి రామ్మోహన్ తెలిపారు.శనివారం స్థానిక మైదుకూరు రోడ్డు హోండా షోరూం ఎదురుగా నూతనంగా ఏర్పాటైన ఎంసీ ఫర్నీ చర్స్ ఇంటీరియర్స్‌ను బుశెట్టి రామ్మోహన్ ప్రారంభించారు. ఇంటికి, కార్యాలయాలకైనా మోడల్ ఫర్నీచర్స్ అంతా ఇక్కడ లభిస్తుందని ఆ సంస్థ యజమానులు సునీల్ కుమార్ ,పీఎస్ నవాజ్ తెలిపారు.

నేటి నుంచి పల్లె పండుగ వారోత్సవాలు

ప్రొద్దుటూరు అక్టోబరు 13 : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామీణ అభివృద్ధి పై దృష్టి సారించింది. అందులో భాగంగా నేటి నుంచి వారం రోజులపాటు పల్లెల్లో పలు కార్యక్రమాలు ప్రారంభిస్తూ పల్లె పండుగ వారోత్సవాలు నిర్వహిస్తున్నది. ఈనెల 14 నుంచి 20 వరకు ప్రొద్దుటూరు మండలంలోని చౌట పల్లె, దొరసానిపల్లె,కామనూరు, చెన్నమ రాజుపల్లె, తాళ్లమాపురం, సీతంపల్లె, చౌడూరు, పెద్ద శెట్టిపల్లె, కల్లూరు, నంగనూరుపల్లె, కొత్తపల్లె, ఉప్పరపల్లె, సోములవారిపల్లె, గోపవరం గ్రామాలలో మొత్తం 8758 మీటర్ల మేర సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టనుంది, ఇందుకోసం రూ.4.30 కోట్లు నిధులు వెచ్చించనుంది. అలాగే రాజుపాళెం మండలంలో చిన్న శెట్టిపల్లె, గాదెగూడూరు, కూలూరు పగిడాల వెలవలి టంగుటూరు, కొట్టాల, వాసుదేవపురం, వెంగళాయపల్లె, అయ్యవారిపల్లె, రాజుపాలెం, కుమ్మరిపల్లె, వెల్లాల, అర్కటవేముల, సోమాపురం, తొండలదిన్నె, పర్లపాడు గ్రామాలలో మొత్తం 9111 మీటర్ల మేర సీసీ రోడ్లు దాదాపు రూ4.20 కోట్లతో నిర్మాణం చేపట్టనుంది.నేటి నుంచి 20 వరకు ఈ గ్రామాల్లో ఎమ్మెల్యే వరద రాజులరెడ్డి పనులు ప్రారంభిస్తారని ఎంపీడీవోలు సూర్యనారాయణరెడ్డి, రమణారెడ్డి తెలిపారు.

టీడీపీలో చేరిన కౌన్సిలర్ మీగడ దీప్తి



వైసీపీ కౌన్సిలర్‌మీగడ దీప్తి, చంద్రశేఖర్‌రెడ్డి దంపతులను టీడీపీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు అక్టోబరు 13 : వైసీపీ 30 వవార్డు కౌన్సిలర్ మీగడ దీప్తి ఆపార్టీని వీడి టీడీపీలో చేరారు. శుక్రవారం స్థానిక 30 వవార్డులోని ఆమె స్వగృహంలో ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి అధ్వర్యంలో మీగడ దీప్తి, ఆమెభర్త చంద్రశేఖర్‌రెడ్డి టీడీపీ కండువా కప్పుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి,మాజీ ఎంపీపీ రాఘవరెడ్డి, ఈవీ సుధాకర్‌రెడ్డి, పీఎస్ ముక్తియార్, మార్తల లక్ష్మీరెడ్డి, మాజీ కౌన్సిలర్లు బద్వేలు శ్రీనివాసులరెడ్డి వద్ది బాలుడు పాల్గొన్నారు.

వృద్ధాప్యం బాల్యంతో సమానం



పుస్తకావిష్కరణ చేస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్, అక్టోబరు 13: వృద్ధాప్యం బాల్యంతో సమానమని శాసనసభ రిటైర్డు ఏఎస్పీ డాక్టర్ ఎం.ప్రభాకర్ పేర్కొన్నారు. శనివారం ఎన్జీవో హోంలో ఆయన రచించిన వృద్ధాప్యం రెండో బాల్యం పుస్తకావిష్కరణ జరిగింది. ఆయన మాట్లాడుతూ వృద్ధులకు అండగా ఉండటానికి ఒక హెల్ప్‌లైన్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఎన్జీవో అసోసియేషన్ అధ్యక్షుడు కేజే రఘురామిరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, సుధాకర్, పెంచలయ్య, రెడ్డన్న, కళాకారులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహుడికి ప్రత్యేక పూజలు



బద్వేలు రూరల్, అక్టోబరు 13: వల్లెరవారిపల్లె గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో విజయదశమి సందర్భంగా వేకువజామునే స్వామి వారికి ప్రత్యేక అభిషేకం, అనంతరం శరన్నవరాత్రుల సందర్భంగా స్వామివారికి 18 రకాల 180 కేజీల పండ్లతో ప్రత్యేక అలంకరణలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా పట్టణ గ్రామీణ ప్రాంత ప్రజలు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించు కున్నారు. స్వామివారివిశేష అలంకరణ భక్తులను ఆకట్టుకుంది. మధ్యాహ్నం దాతలు పాపదీప చెంచిరెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.